క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే దాసరి

పెద్దపల్లిరూరల్‌: పెద్దపల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన నాయకులు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతోందని, వచ్చే ఎన్నికల్లోనూ సీఎం కేసీఆర్‌ సారథ్యంలోనే ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమన్నారు. మాజీ ఎంపీపీలు సి.సత్యనారాయణరెడ్డి, వేముల రామ్మూర్తితో పాటు నాయకులు సతీశ్‌రెడ్డి, పవన్‌సాయి, సువర్ణ పాల్గొన్నారు.

మహిళల సంక్షేమం కోసం అనేక పథకాలు



మాట్లాడుతున్న మూల విజయారెడ్డి

యైటింక్లయిన్‌కాలనీ: రాష్ట్రంలోని మహిళల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్‌ అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, ఇతర పార్టీలు ఓటు అడిగే నైతిక హక్కులేదని బీఆర్‌ఎస్‌ మహిళా కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల విజయారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక టీబీజీకేఎస్‌ కార్యాలయంలో నిర్వహించిన కాలనీ పట్టణ మహిళా ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మహిళలు ఐక్యంగా ఉండి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ రామగుండం నియోజకవర్గం అభ్యర్థి కోరుకంటి చందర్‌ను గెలిపించాలని కోరారు. కార్పొరేటర్లు సాగంటి శంకర్‌, అంజలీదేవి, కిషన్‌రెడ్డి, కాలనీ మహిళా అధ్యక్షురాలు విజయ, సంధ్యారెడ్డి, నాయకులు సదయ్య పాల్గొన్నారు.

కారు దిగి కాంగ్రెస్‌లోకి సతీశ్‌బాబు

ఎలిగేడు: బీఆర్‌ఎస్‌ పార్టీ క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లోకి వెళ్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం మండల ప్రధాన కార్యదర్శి తాటిపల్లి సతీశ్‌బాబు అన్నారు. ఆదివారం ఎలిగేడులో మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌లో కష్టపడ్డ వారికి గుర్తింపులేదని గత రెండు పర్యాయాలు దాసరి మనోహర్‌రెడ్డి గెలుపు కోసం తనవంతు కృషి చేశానని, అయినా పార్టీలో గుర్తింపు లేదని వాపోయారు. ఇప్పటికే బీఆర్‌ఎస్‌ పార్టీకి రాజీనామా చేసిన ఎలిగేడు మండల వైస్‌ ఎంపీపీ బుర్ర వీరస్వామిగౌడ్‌ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌ అభ్యర్థి చింతకుంట విజయరమణారావు నేతృత్వంలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ఆయన చెప్పారు.

లయన్స్‌క్లబ్‌ ఆధ్వర్యంలో అన్నదానం

పెద్దపల్లిరూరల్‌: పట్టణంలోని జెండాకూడలిలో మీల్స్‌ ఆన్‌ వీల్స్‌ వాహనం ద్వారా ఆదివారం లయన్స్‌క్లబ్‌ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. క్లబ్‌ జీఎంటీ కోఆర్డినేటర్‌ రాజ్‌గోపాల్‌, సాదుల వెంకటేశ్వర్లు, జైపాల్‌రెడ్డి, వేల్పుల రమేశ్‌, గంట్ల రాంచంద్రారెడ్డి, కుంభం సంతోష్‌, పవన్‌కుమార్‌ పాల్గొన్నారు.

జెడ్పీచైర్మన్‌పై అసత్య ఆరోపణలు మానుకోవాలి

రామగిరి: కాంగ్రెస్‌ నాయకులు బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధుపై అసత్య ఆరోపణలు మానుకోవాలని రైతు సమన్వయ సమితి కన్వీనర్‌ మ్యాదరబోయిన కుమార్‌యాదవ్‌ అన్నారు. ఆదివారం సెంటినరీకాలనీ టీబీజీకేఎస్‌ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సోషల్‌ మీడియా ద్వారా అనుచిత వ్యాఖ్యలు, అసత్య ప్రచారాలు చేసే కాంగ్రెస్‌ నాయకులు తమ నాయకుడిపై అసత్య ప్రచారాలు అంటూ మాట్లడ్డం విడ్డూరంగా ఉందన్నారు. మంథనిలో బీఆర్‌ఎస్‌ గెలుపు తథ్యమన్నారు. ఆర్జీ–3 టీబీజీకేఎస్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ గౌతం శంకరయ్య, నాయకులు దేవ శ్రీనివాస్‌, అల్లం తిరుపతి, దామెర శ్రీనివాస్‌, కొండవేన ప్రభాకర్‌, కొలిపాక సత్తయ్య, సైండ్ల సత్యనారాయణ, జాపతి శేఖర్‌, రేండ్ల అశోక్‌, దాసరి సంపత్‌, గండి శ్రీనివాస్‌, బొడిగె క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు



పార్టీ కండువా కప్పుతున్న సునీల్‌

మంథని: మంథని మండలం సిరిపురం గ్రామానికి చెందిన సుమారు 40 మంది బీజేపీలో చేరారు. ఆదివారం మంథనిలోని పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సండే మార్కెట్‌లో సమస్యలు

- మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్న మహిళలు
- పార్కింగ్‌ స్థలం లేక తిప్పలు
- ఎన్టీపీసీ సీఎస్సార్‌ ద్వారా నిర్మించాలని వేడుకోలు



ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌లోని సండే మార్కెట్‌

జ్యోతినగర్‌: ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లోని సండే మార్కెట్‌లో కూరగాయాలు విక్రయించేందుకు ఎన్టీపీసీ సంస్థ సీఎస్సార్‌ ద్వారా అత్యంత ఖరీదైన షెడ్‌లను నిర్మించింది. కూరగాయల విక్రేతలకు, మాంసం, చికెన్‌, చేపల విక్రయదారులు, బట్టల వ్యాపారులకు వేర్వేరుగా షెడ్‌లను నిర్మించారు. నీటి కోసం నల్లాలను సైతం బిగించారు. కానీ మహిళలు, పురుషులు మల, మూత్ర విసర్జన చేసేందుకు ఒక మరుగుదొడ్డి కూడా లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. కూరగాయలు విక్రయించే వారు అత్యవసరమైన సమయంలో ఆమడ దూరం వెళ్లాల్సిన అవసరం ఏర్పడటంతో అవస్థలు పడుతున్నారు. ఎన్టీపీసీ సంస్థ వారు సకల సౌకర్యాలు చేసినప్పటికీ మరుగుదొడ్డి నిర్మించకపోవడంతో అవస్థలు పడాల్సి వస్తోందని వారు ఆవేదన చెందుతున్నారు. యాజమాన్యం ప్రజలు, విక్రయదారుల సౌకర్యం కోసం మూత్రశాలలు నిర్మించాలని కోరుతున్నారు. అదేవిధంగా మార్కెట్‌ వచ్చే కొనుగోలుదారులు వాహనాలను పార్కింగ్‌ చేసేందుకు స్థలం లేకపోవడంతో సర్వీస్‌ రోడ్డుపై పార్కింగ్‌ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌ జామ్‌ అవుతోంది.

మరుగుదొడ్లు లేక ఇబ్బంది



సండే మార్కెట్‌లో ప్రతి ఆదివారం సంత జరుగుతుంది. షెడ్‌లను ఎన్టీపీసీ వారు నిర్మించారు. స్త్రీలకు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లను నిర్మించి ప్రజల ఇబ్బందులు తొలగించాలి.

– రాజు, చిరు వ్యాపారి, సండే మార్కెట్‌, ఎన్టీపీసీ రామగుండం

పార్కింగ్‌ స్థలం ఏర్పాటు చేయాలి



సండే మార్కెట్‌కు వచ్చే కొనుగోలుదారుల వాహనాల పార్కింగ్‌ కోసం ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలి. సర్వీసురోడ్డుపై పార్కింగ్‌ చేయడంతో ట్రాఫిక్‌ జామ్‌ అవుతోంది. సాయి సేవాసమితి సమీపంలోని స్థలంలో పార్కింగ్‌ కోసం స్థలాన్ని కేటాయించాలి.

– శ్రీధర్‌, ఎన్టీపీసీ రామగుండం

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



పార్టీలో చేరుతున్న మైనార్టీ నాయకులు

జూలపల్లి: బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ రఘువీర్‌ సింగ్‌ అన్నారు. మండల కేంద్రానికి చెందిన కొత్త ఓటర్లు, మైనార్టీలు ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. కాగా వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్బండ వర్గాల సంక్షేమం, అభివృద్ధికై సీఎం కేసీఆర్‌ కృషి చేస్తున్నారన్నారు. ఉచిత కరెంటు, ఆసరా ఫించన్లు, రైతుబంధు, దళితబంధు, బీసీలకు లక్ష ఆర్థికసాయం, పేదింటి ఆడబిడ్డలకు అండగా కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌ పథకాలను అమలు చేస్తున్నారు. ,గ్రామాల్లో సకల సౌకర్యాలు కల్పించి, దేశంలోనే రాష్ట్రంగా ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ కారు గుర్తుకు ఓటువేసి భారీ మెజారిటీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు విసారపు వెంకటేశం, తాజుద్దీన్‌, మల్లెత్తుల కనుకయ్య, లక్ష్మణ్‌ ఉన్నారు.

పెద్దాపూర్‌, కుమ్మరికుంటలో..

పెద్దాపూర్‌, కుమ్మరికుంటలో బీఆర్‌ఎస్‌ అభ్యర్థి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో నాయకులు ఎంపీటీసీ మల్లేశం, కుంట రాజేశ్వర్‌రెడ్డి, కొత్త శ్రీధర్‌, పూరెల్ల గంగయ్య, తొగరు శ్రీనివాస్‌, కృష్ణమూర్తి, సత్యసాగర్‌ ఉన్నారు.

‘డ్రైనేజీ నిర్మించండి మేడమ్‌’



చైర్‌పర్సన్‌కు విన్నవిస్తున్న కాలనీవాసి

పెద్దపల్లిరూరల్‌: ‘మేడమ్‌ చాలాకాలంగా డ్రైనేజీ నిర్మాణం కోసం ఆఫీస్‌ చుట్టూ తిరిగాం. కానీ ఇప్పటివరకు పని మొదలు కాలేదు. మీ హయాంలోనైనా ఈ నిర్మాణం చేయండి.. మా ఓట్లు మీ పార్టీకే వేస్తాం’ అంటూ పట్టణంలోని గణేశ్‌నగర్‌ కాలనీవాసులు మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మమతారెడ్డిని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అటుగా వచ్చి ఓట్లు అడుగుతున్న చైర్‌పర్సన్‌తో ఈ సమస్య ప్రస్తావించారు. తప్పనిసరిగా పనిచేయిస్తానంటూ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మాటిచ్చారని కాలనీవాసులు తెలిపారు.

యాదవ, కుర్మ కార్పొరేషన్‌ ఏర్పాటులో విఫలం



మాట్లాడుతున్న మారం తిరుపతియాదవ్‌

ముత్తారం: యాదవ, కుర్మ కార్పొరేషన్‌ ఏర్పాటు చేయడంలో సీఎం కేసీఆర్‌ విఫలమయ్యారని గొర్ల కాపర్ల సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతియాదవ్‌ ఆరోపించారు. ఆదివారం ముత్తారంలో జరిగిన యాదవ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండోవిడత గొర్రెల పంపిణీ యూనిట్లకు నగదు బదిలీ చేయాలన్నారు. నవంబరు 2న పెద్దపల్లిలో భారీగా చేపట్టే నిరసన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యాదవ సంఘం మండల అధ్యక్షుడు కాసు తిరుపతియాదవ్‌, గౌరవ అధ్యక్షుడు మారేడు గొండ రాజయ్యయాదవ్‌, ఉపాధ్యక్షుడు బక్కతట్ల కుమార్‌యాదవ్‌, చెలుకల జితేందర్‌యాదవ్‌, సదానందం యాదవ్‌, కొమురయ్యయాదవ్‌, మారం రఘు యాదవ్‌ పాల్గొన్నారు.

శ్రీధర్‌బాబును గెలిపించాలి



ప్రచారం చేస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో ఆదివారం కాంగ్రెస్‌ నాయకులు ఇంటింటా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్‌ మంథని నియోజకవర్గం అభ్యర్థి ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఓటేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. మాజీ సర్పంచ్‌ చాట్ల సదానందం, మాజీ ఎంపీటీసీ శనిగరపు తిరుపతి, శ్రీనివాస్‌, శ్యామ్‌, శ్రీను, గడ్డం సతీశ్‌, వంశీ, రాజశేఖర్‌, అనిల్‌, వెంకటేశ్‌ పాల్గొన్నారు.

సోమారపు సత్యనారాయణకు మద్దతు



మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్‌ కార్యకర్తలు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్‌ సోమారపు సత్యనారాయణకు రామగుండం నియోజకవర్గం ఇండిపెండెంట్‌ అభ్యర్థిగా పోటీ చేస్తుండడంతో భారీగా మద్దతు పెరుగుతోంది. బసంతనగర్‌కు చెందిన శెట్టి సంపత్‌ ఆధ్వర్యంలో ఆదివారం గౌతమినగర్‌లోని ఆయన నివాసంలో 100మంది కాంగ్రెస్‌ కార్యకర్తలు సత్యనారాయణకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ముదంగుల రాజం, జట్‌పట్‌ కొమురయ్య, ముదంగుల చందు, జట్‌పట్‌ రాజం, దరంగుల కుమార్‌, దరంగుల సాగర్‌, ముదంగుల అనిల్‌, జట్‌పట్‌ శ్రీనివాస్‌, రమేశ్‌ మద్దతు తెలిపారు.

గ్యారంటీ పథకాలపై ప్రచారం



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

ముత్తారం: మండలంలోని ఓడేడ్‌లో ఆదివారం కాంగ్రెస్‌ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాల కార్డులను నాయకులు ఇంటింటా పంపిణీ చేశారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే ఈ ఆరుగ్యారంటీ పథకాలు వర్తిసాయని నాయకులు వివరించారు. మంథని ఎమ్మెల్యేగా దుద్దిళ్ల శ్రీధర్‌బాబును గెలిపించాలని ఓటర్లను కోరారు. నాయకులు దాసరి చంద్రమౌళి, తీగల సత్యనారాయణరావు, సూదాటి సంపత్‌రావు, రాయమల్లు పాల్గొన్నారు.

బీజేపీకి మామిడాల రమేశ్‌ రాజీనామా

ఎలిగేడు: బీజేపీ ఎలిగేడు మండల మాజీ అధ్యక్షుడు మామిడాల రమేశ్‌ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఆదివారం ఎలిగేడులో ప్రకటించారు. భవిష్యత్‌ కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తానని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

✦నియామకం

రామగిరి: యూత్‌ కాంగ్రెస్‌ మండల ఉపాధ్యక్షుడిగా మండలంలోని లద్నాపూర్‌ గ్రామానికి చెందిన పులి సాయిగౌడ్‌ను నియమించారు. నియామకపత్రాన్ని మండల అధ్యక్షుడు రోడ్ద బాపు, యూత్‌ కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు దాసరి శివ ఆదివారం అందజేశారు. యూత్‌ కాంగ్రెస్‌ డివిజన్‌ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్‌, బీసీ సెల్‌ అధ్యక్షుడు బండారి సదానందం, నాయకులు తొగరి చంద్రయ్య, గొర్రె నరేశ్‌, అడ్డూరి ప్రవీణ్‌ పాల్గొన్నారు.

✦పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ అప్పగింత

పాలకుర్తి: బసంత్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని రంగాపూర్‌కు చెందిన చిందం సంధ్య అనే మహిళ పోగొట్టుకున సెల్‌ఫోన్‌ను ఆదివారం బసంత్‌నగర్‌ ఎస్సై వెంకటేశ్‌ బాధిత మహిళకు అందజేశారు. సెల్‌ఫోన్‌ పోగొట్టుకున్న విషయాన్ని సంధ్య సీఈఐఆర్‌ పోర్టల్‌ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంది. బసంత్‌నగర్‌ పోలీసులు సాంకేతిక సాయంతో సెల్‌ఫోన్‌ కనిపెట్టి సంధ్యకు అప్పగించారు.

✦కాంగ్రెస్‌ విజయం కోసం పనిచేద్దాం

పెద్దపల్లిరూరల్‌: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ విజయం కోసం పాటుపడదామని పెద్దపల్లి నియోజకవర్గ యూత్‌కాంగ్రెస్‌ ఉపాధ్యక్షురాలు తమ్మనవేన స్వప్న, శ్రీనివాస్‌ అన్నారు. రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన సత్యనారాయణరెడ్డిని అప్పన్నపేటకు చెందిన పలువురు సత్కరించారు.

✦కాంగ్రెస్‌లోకి కుందనపల్లి మాజీ సర్పంచ్‌

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి మాజీ సర్పంచ్‌ మేకల సరస్వతి–మైసయ్య దంపతులు వందలాది మంది అనుచరులతో ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్‌ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీసీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు మహేశ్‌, నారాయణ, శేఖర్‌ ఉన్నారు.

✦కాంగ్రెస్‌లో పలువురి చేరిక

పాలకుర్తి: మండలంలోని కుక్కలగూడుర్‌, బామ్లా నాయక్‌తండా గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్‌, బీజేఈ నాయకులు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. డీసీసీ అధ్యక్షుడు, రామగుండం నియోజకవర్గ అభ్యర్థి మక్కాన్‌సింగ్‌ రాజ్‌ఠాకూర్‌ వారికి కండువా కప్పి కాంగ్రెస్లోకి ఆహ్వానించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య, మాజీ సర్పంచ్‌ లాల్‌సింగ్‌, షకీలాల్‌, అంజినాయక్‌, స్వామి, మేడం రాకేశ్‌ పాల్గొన్నారు.

✦పద్మశాలీ సంఘం కార్యవర్గం ఎన్నిక

పాలకుర్తి: పాలకుర్తి మండలం కన్నాల గ్రామ పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శాలపల్లి గ్రామ రామాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సంఘం సభ్యుల సమావేశానికి మండల అధ్యక్షుడు కన్నం వెంకటేశ్‌ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా అరికల సతీశ్‌, ప్రధాన కార్యదర్శిగా భీమనపల్లి పృథ్వీరాజ్‌, కోశాధికారిగా సిరిపురం శ్రీధర్‌, ఉపాధ్యక్షులుగా చింతకింది కనుకయ్య, తాటిపాముల కిషన్‌, కుడిక్యాల సురేశ్‌, దాసరి సాగర్‌, ప్రచార కార్యదర్శిగా చింతకింది రమణ, తన్నీరు తిరుపతి, గుండేటి రామ్మూర్తి ఎన్నికయ్యారు. అదేవిధంగా గౌరవ అధ్యక్షుడిగా శ్రీహరి, సలహాదారులుగా నారాయణ, భాస్కర్‌, రమేశ్‌, రాజేశం, రాయమల్లును ఎన్నుకున్నారు.

✦అనారోగ్యంతో కానిస్టేబుల్‌ మృతి

గోదావరిఖని: రెండేళ్లుగా గోదావరిఖని వన్‌టౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పి.ప్రవీణ్‌(33) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. బ్లూకోల్ట్స్‌ విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్‌ అనారోగ్యానికి గురయ్యాడు. ఆదివారం పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

పుట్ట మధు గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం



మాట్లాడుతున్న రాజేశ్‌

మంథని: బీఆర్‌ఎస్‌ మంథని అభ్యర్థి, పెద్దపల్లి జెడ్పీచైర్మన్‌ పుట్ట మధుకు అత్యధిక మెజారిటీ లక్ష్యంగా పని చేస్తామని పార్టీ ఎన్నికల ప్రచార కమిటీ అధ్యక్షుడు సెగ్గెం రాజేశ్‌ అన్నారు. మంథని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పుట్ట మధు ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేపట్టారన్నారు. తాను పార్టీ వీడితే ఓర్చుకోలేని కాంగ్రెస్‌ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో పుట్ట మధు గెలుపు నల్లేరు మీద నడక లాంటిదే అన్నారు. నాయకులు ఏగోళపు శంకర్‌గౌడ్‌, తగరం శంకర్‌లాల్‌, జంజర్ల శేఖర్‌, కాసిపేట సాగర్‌, ప్రభాకర్‌, ఆసిఫ్‌ ఖాన్‌, పీకమల్ల య్య, బండారు తిరుపతి, కాసిపేట స్వామి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ అరాచకాలను అంతమొందిద్దాం



ప్రచారం చేస్తున్న విజయరమణారావు

పెద్దపల్లిరూరల్‌: బీఆర్‌ఎస్‌ పాలకులు సాగిస్తున్న అరాచక పాలనను అంతమొందించేందుకు సమయం ఆసన్నమైందని వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను భూస్థాపితం చేయాలని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి పట్టణంలోని 21వ వార్డు (శాంతినగర్‌)లో, మండలంలోని సబ్బితంలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ప్రజా, రైతు సంక్షేమాన్ని విస్మరించి కేవలం తన ఆస్తులను పెంచుకోవడంపైనే దృష్టి సారించాడని ఆరోపించారు. కాంగ్రెస్‌కు పాలించే అవకాశం ఇస్తే అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీకే ఓటేవయాలని కోరారు. నాయకులు ముడుసు సాంబిరెడ్డి, గంట రమేశ్‌, సారథిరెడ్డి, రాంరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలపై ప్రచారం

పెద్దపల్లిరూరల్‌: పట్టణంలోని శాంతినగర్‌లో ఆదివారం కాంగ్రెస్‌ కార్యకర్తలు వినూత్నరీతిలో ప్రచారం సాగించారు. మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌ ప్రకటించిన ఆరు గ్యారంటీలను వివరిస్తూ ముడుసు బ్రదర్స్‌, మాజీ ఎంపీటీసీ గంట రమేశ్‌ ముద్రించిన ఫ్లెక్సీని కొందరు కార్యకర్తలు ఒంటిపై ధరించి ప్రచారంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

జంగ్ తెలంగాణ

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

పెద్దపల్లిరూరల్‌: కాంగ్రెస్‌ ప్రకటించిన ఆరు గ్యారంటీలకు ఆకర్షితులై నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన నాయకులు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు తెలిపారు. వారందరికీ కండువా కప్పి ఆహ్వానించరు. నాయకులు లక్ష్మయ్య, కొమురయ్య, కుమార్‌, రాజయ్య, మహేశ్‌, రాజేశం ఉన్నారు.

బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌లను చిత్తుగా ఓడించాలి



ప్రచారంలో దాసరి ఉష

ఓదెల: ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ పార్టీలను చిత్తుగా ఓడించాలని బీఎస్పీ పెద్దపల్లి అభ్యర్థి దాసరి ఉష కోరారు. ఆదివారం ఓదెలలో మన ఊరు మన ఉష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ బీఎస్పీ అధికారంలోకి వస్తే చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఏనుగు గుర్తుకు ఓటేసి గెలిపించాలని, పెద్దపల్లిని రాష్ట్రంలో అగ్రగామిగా చేస్తానన్నారు. మండలంలోని పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మోసపూరిత మాటలు నమ్మొద్దు

పెద్దపల్లిరూరల్‌: ధనదాహంతో అధికార బీఆర్‌ఎస్‌ పార్టీ, అధికార దాహంతో ఉన్న కాంగ్రెస్‌ పార్టీల నేతలు చెప్పే మోసపూరిత మాటలను నమ్మొద్దని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. పెద్దపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం పలువురు నాయకులు బీఎస్పీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. నాయకులు సంపత్‌, శ్రీనివాస్‌, కృష్ణ, రాహుల్‌, రమేశ్‌, సాగర్‌, వెంకటేశ్‌, చంద్రశేఖర్‌, రోహిత్‌, రాజయ్య, రాము, సాయిప్రకాశ్‌ ఉన్నారు.

నియోజకవర్గంలో మౌలిక వసతులకు పెద్దపీట

సుల్తానాబాద్‌: నియోజకవర్గంలో మౌలిక వతుల కల్పనకు ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పెద్దపీట వేశారని ఆయన సతీమణి దాసరి పుష్పలత అన్నారు. పట్టణంలోని శాస్త్రీనగర్‌, స్వప్న కాలనీలో ఆదివారం ఎమ్మెల్యే దాసరి మనోహర్‌ రెడ్డికి మద్దతుగా నిలవాలని కోరారు. ఇప్పటికే రోడ్లు, రవాణా సౌకర్యాలకు అధికంగా నిధులు కేటాయించి మౌలిక వసతులు కల్పించారన్నారు. మరింత అభివృద్ధి జరగాలంటే మరోసారి కారు గుర్తుకే ఓటేయాలని కోరారు. మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ ముత్యం సునీత, ఆర్యవైశ్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పల్లా అపర్ణ, కౌన్సిలర్లు, వ్యవసాయ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ బుర్ర మౌనిక, జ్ఞానేశ్వరి, మమత కూకట్ల గోపి, గుర్రాల శ్రీనివాస్‌, తిరుపతి, నాయకులు రమేశ్‌, సురేశ్‌, తిరుపతి, సంపత్‌, మధుసూదన్‌రెడ్డి, సంజీవ్‌, కృష్ణప్రియ ఉన్నారు.

తండ్రి గెలుపు కోసం తనయుడి ప్రచారం



గుర్రాంపల్లిలో ప్రశాంత్‌రెడ్డి ప్రచారం

పెద్దపల్లిరూరల్‌: పెద్దపల్లి సిట్టింగ్‌ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా మూడోసారి పోటీలో ఉన్నారు. ఈ మేరకు ఆయన గెలుపుకోసం తనయుడు దాసరి ప్రశాంత్‌రెడ్డి పెద్దపల్లి మండలం గుర్రాంపల్లిలో విండో చైర్మన్‌ నర్సింహారెడ్డి తదితరులతో కలిసి ప్రచారం నిర్వహించారు. తన తండ్రి మనోహర్‌రెడ్డికి ఓటువేసి ఆశీర్వదించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ఇంటింటి ప్రచారంలో నాయికులు

కాల్వశ్రీరాంపూర్‌: సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా పకడ్బందీగా అమలు చేయడంతో నియోజకర్గంలో బీఆర్‌ఎస్‌ పార్టీకి ఆదరణ చెక్కు చెదరలేదని ఆదివారం ఎంపీపీ నూనేటి సంపత్‌ యాదవ్‌, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి అన్నారు. పందిల్ల, కూనారం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సర్పంచ్‌ లావణ్య, ఎంపీటీసీ రమాదేవి, మాజీ సర్పంచ్‌ కొమురయ్య, సోషల్‌ మీడియా ఇన్‌చార్జి రవి, నాయకులు రాయమల్లు, రమేశ్‌, శ్రీకాంత్‌, పైడయ్య, మహేందర్‌, చంద్రయ్య, వెంకటస్వామి, మల్లేశ్‌, రామ్మూర్తి పాల్గొన్నారు.

ఉచితంగా షుగర్‌ నిర్ధారణ పరీక్షలు

పెద్దపల్లిరూరల్‌: పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామంలో ఆదివారం లయన్స్‌క్లబ్‌ పెద్దపల్లి ఎలైట్‌ ఆధ్వర్యంలో ఉచిత షుగర్‌ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించామని క్లబ్‌ రీజినల్‌ చైర్మన్‌ అశోక్‌కుమార్‌ తెలిపారు. తమను సంప్రదిస్తే ఆయా గ్రామాల్లో ఉచిత శిబిరాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పిట్ట వెంకటేశ్‌, అతీఫ్‌ ఉన్నారు.

బీజేపీలో చేరిన ‘చల్లా’



మంథని: మంథని నుంచి బీఆర్‌ఎస్‌ టికెట్‌ ఆశించి భంగపడ్డ కాటారం పీఏసీఎస్‌ చైర్మన్‌ చల్లా నారాయణరెడ్డి ఆదివారం బీజేపీ గూటికి చేరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో సుమారు 300 మందితో పార్టీలో చేరారు.

ఇంటింటా ప్రచారం



ప్రచారం చేస్తున్న నాయకులు

కమాన్‌పూర్‌: మండలంలోని కమాన్‌పూర్‌, గుండారం, నాగారం, రొంపికుంట గ్రామాల్లో బీఆర్‌ఎస్‌ ఆధ్వర్యంలో నాయకులు పుట్ట మధును గెలిపించాలని కోరారు. ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం విడుదల చేసిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు.